# గ్యారెంటీ లేని మాఫీ

## అంతా ఆగమాగం.. అయోమయం

రేపే అధికారంలోకి వస్తాం..ఎల్లుండే రుణమాఫీ అన్నరు; అంతా అబద్ధం
2 లక్షల రుణం ఒకేసారి మాఫీ.. మాదీ గ్యారెంటీ అన్నరు; మరో అబద్ధం
ఇప్పడైతే లక్ష లోపు మొత్తం ఖతం.. చూసుకోండ్రి అన్నరు; ఇంకో అబద్ధం
సరేపోనీ.. ఆ రూ.లక్ష అయినా మాఫీ అయ్యిందా అంటే అదీ లేదు!
ఇప్పటికీ బ్యాంకులకు చేరని లిస్టులు.. ఖాతాల్లో జమకాని పైసలు!!
అయినవాళ్లలోనూ సగమే మాఫీ.. వేల మందికి లభించని రుణవిముక్తి
కర్షకులకు తప్పని తిప్పలు..! కాంగ్రెస్ సర్కారువేమో గొప్పలు..!!

- ఒక్క ములుగు జిల్లా ఎస్‌బీఐలో 4,065 మందికి దక్కని విముక్తి
- మాఫీ అయినా వడ్డీ పేరుతో రైతులను పీడిస్తున్న బ్యాంకులు
- మిత్తి పైసలు కట్టేందుకూ అప్పులు చేస్తున్న అన్నదాతలు
- రాష్ట్రమంతా ఇవే తిప్పలు.. 10 రోజులుగా తప్పని ప్రదక్షిణలు

రూ.లక్షలోపు రుణాలు తీసుకున్న రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసినట్టు రాష్ట్ర ప్రభుత్వం గొప్పలకు పోతున్నా.. క్షేత్రస్థాయి లో వేల మంది రైతులకు ఇంకా మాఫీ కాలేదని తెలుస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఎందుకు మాఫీ కాలేదని.. అటు వ్యవసాయ శాఖ అధికారుల చుట్టూ, ఇటు బ్యాంకుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. రుణమాఫీ అయిన వాళ్లూ మిత్తి పైసలు కట్టేందుకు నానా కష్టాలు పడుతున్నారు. వడ్డీ కడితేనే మాఫీ అని బ్యాంకులు తెగేసి చెప్పడంతో దిక్కులేక కొత్తగా అప్పు తెచ్చి మరీ కడుతున్నారు. ఒక్కో జిల్లాలో ఒక్కో పరిస్థితి..అంతా అయోమయం.. గందరగోళం.వాస్తవ సంఖ్య కు రుణమాఫీ అయిన వారి సంఖ్యకు రెట్టిం పు స్థాయిలో వ్యత్యాసం ఉండటమే ఇందుకు కారణం. మెదక్ జిల్లాలో 31 పీఏసీఎస్‌లు ఉన్నాయి. డీసీసీబీ నుంచి రుణాలు తీసుకున్న రైతులందరికీ రూ.లక్షలోపు రుణమాఫీ కాలేదు. రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్నవారు 18,239 మంది ఉండగా, వారిలో 9,271 మందికి మాత్రమే మాఫీ అయినట్టు బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం మైతాపూర్‌లో 250 మందికి పైగా రైతులు రూ.లక్ష లోపు రుణం తీసుకున్న వారే.రుణమాఫీ జాబితాలో 86 మంది రైతుల పేర్లు మాత్రమే కనిపించాయి. జగిత్యాల జిల్లాల్లోని ఇండియన్ బ్యాంక్ శాఖల్లో 6 వేల మందికి పైగా రైతులు రుణం పొందగా, 2,500 మందికి పైగా రూ.లక్షలోపు రుణం ఉన్నవారి పేర్లు కనిపించలేదు. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకులో 226 మంది రైతుల పేర్లు జాబితాలో లేవు. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలంలోని క్యాతూరులో రూ.లక్ష రుణాలు ఉన్న రైతులు 240 మంది ఉండగా, 200 మందికి మాఫీ కాలేదు. ములుగు జిల్లాలోని మూడు, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలోని ఒక పీఏసీఎస్ పరిధిలోని రైతులకు రుణ మాఫీ కాలేదు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట సొసైటీ కింద 16 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులు 4,200 మంది ఉండగా ఒక్కరికీ మాఫీ కాలేదని ఆందోళన చెందుతున్నా రు. మహబూబాబాద్ జిల్లా బేతవోలులో రూ.లక్ష లోపు రుణాలు 120 మంది తీసుకోగా, కేవలం 15 మందికే రుణమాఫీ వర్తించింది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్-టీ మండలంలోని ప్రాథమిక సహకార సంఘంలో 388 మంది రైతులు రూ. లక్షలోపు రుణాలు తీసుకున్నారు. వీరిలో ఎవరికి రుణమాఫీ అయిందో.. ఎవరికి కాలేదో సహకార బ్యాంకు అధికారులకూ సమాచారం లేదు. తిర్యాణి మండలంలోని ప్రాథమిక సహకార సంఘం ద్వారా 462 మంది రైతు లు రూ.లక్షలోపు రుణం పొందినవారు ఉన్నా రు. వీరిలో 197 మందికి మాత్రమే రుణమాఫీ అయింది. కౌటాల ప్రాథమిక సహకార సంఘంలో సుమారు 600 మంది రైతులు లక్ష లోపు రుణాలు తీసుకున్నవారు ఉండగా, వీరిలో 349 మందికే మాఫీ అయింది.

- నమస్తే తెలంగాణ న్యూస్ నెట్‌వర్క్



### వృద్ధాప్యంలో అధికారుల చుట్టూ తిరుగుతూ..

జగిత్యాల జిల్లాలోని రాయికల్ మండలం మైతాపూర్ గ్రామానికి చెందిన ఏనుగుల గంగు, వృద్ధాప్యానికి చేరువగా వచ్చిన మహిళ. అయినా వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నది. తనకు ఉన్న భూమిని ఇద్దరు కొడుకులు, కూతురికి పంచి ఇచ్చిన గంగు.. తన కోసం 1.37 ఎకరాల వ్యవసాయ భూమిని ఉంచుకొన్నది. ఆ భూమిలో మక్కజొన్న పంటను సాగు చేస్తున్నది. రెండేండ్ల క్రితం పంట రుణంగా రూ.55 వేలు తీసుకొన్నది. క్రమం తప్పకుండా వడ్డీ చెల్లిస్తూ వస్తున్నది. రూ.లక్షలోపు రుణం మాఫీ అవుతుందని ప్రకటించగానే సంబురపడ్డది. కానీ, జాబితాను తన పేరు లేకపోవటంతో గంగు హతాశురాలైంది. వ్యవసాయ శాఖ ఏఈవో, బ్యాంకు అధికారులను కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందని గోడు వెల్లబోసుకున్నది.



### కాంగ్రెస్ సర్కారు మోసం చేసింది

నా పేరు మీద రూ.35 వేలు, నా భార్య ఓదెమనుబాయి పేరు మీద రూ.50 వేల పంటరుణం ఉన్నది. ఇద్దరిలో ఒక్కరికీ రుణమాఫీ కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మమ్మల్ని మోసం చేసింది.

- ఓదె పత్రు, వెంకట్రావ్‌పేట్, సిర్పూర్ మండలం, కుమ్రంభీం ఆసిఫాబాద్



### సంతోషం.. నీరుగారింది

గజ్వేల్ మంజీరా బ్యాంక్‌లో నాలు గేండ్ల కిందట రూ.55 వేల పంట రుణం తీసుకున్న. ఒకసారి రెన్యువల్ చేయించిన. మొన్న ప్రభుత్వం రూ.లక్షలోపు రుణమాఫీ చేస్తామని చెప్పంగనే సంతోషం అనిపించింది. కానీ లిస్టులో నా పేరు రాలె. సంతోషం నీరుగారింది.

-లింగ నర్సింలు, మైలారం, వర్గల్ మండలం, సిద్దిపేట జిల్లా



### బ్యాంక్‌కు లిస్టే రాలే..

నాకు 30 గుంటల భూమి ఉంది. దౌల్తాబాద్‌లోని ఇండియన్ బ్యాంక్‌లో 18నెలల క్రితం రూ. 60వేల క్రాప్‌లోన్ తీసుకున్న. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ నాకు రాలేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు మా బ్యాంక్‌కు మాఫీ వివరాల లిస్ట్ రాలేదంటున్నరు. దీంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు.

-రవిగౌడ్, రైతు, కోన్యాల, సంగారెడ్డి జిల్లా



### రుణమాఫీ ఉత్తదే

రుణమాఫీ చేసినట్టు ప్రభుత్వం గొప్పలు చెబుతున్నది. మొదటి విడత వేశామన్నారు. అంతా ఉత్తదే. మా గ్రామాల్లోని రైతులకు రుణమాఫీ అయినట్టు మెసేజ్‌లు రాలేదు. నేను చెన్నారావుపేట సొసైటీలో రూ.35 వేలు రుణం తీసుకున్నా. కానీ నాకు రుణమాఫీ కాలేదు. సొసైటీకి వెళ్లి అడిగితే కాలేదని చెబుతున్నరు. ఎవరిని నమ్మాలో అర్థం కావడం లేదు.

- అనుముల కుమారస్వామి, రైతు, ఖాదర్‌పేట, వరంగల్ జిల్లా



### అధికారులు తెల్వదు అంటున్నరు

సిర్పూర్-టీలోని సహకార బ్యాంకులో రూ.95 వేల రుణం ఉన్నది. అది మాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం మాట తప్పింది. మాఫీ లిస్ట్‌లో నా పేరు లేదు. అధికారులను అడిగితే తెలియదు అంటున్నరు.

- దాండ్రె ధర్మారావ్, వెంకట్రావ్‌పేట్, కుమ్రంభీం ఆసిఫాబాద్



## తిప్పి తిప్పి.. మాఫీ కాలేదన్నరు!

కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం నాగులమల్యాల గ్రామానికి చెందిన చట్టు సురేశ్ బావుపేటలోని ఇండియన్ బ్యాంకులో గతంలో రూ.30 వేల పంట రుణం తీసుకున్నాడు. మూడేండ్ల కింద కేసీఆర్ ప్రభుత్వంలో ఇది మాఫీ అయ్యింది. ఈ భరోసాతో మళ్లీ రూ.68 వేల రుణం తీసుకున్నాడు. గతేడాది ఆగస్టు 10న తాను తీసుకున్న రుణం తిరిగి చెల్లించి కొత్తగా మరో రూ.68 వేలు తీసుకున్నాడు. ఈ సారి కూడా తనకు రుణమాఫీ వర్తిస్తుందని ఆశించిన సురేశ్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం మొండి చేయి చూపింది. మాఫీ జాబితాలో తన పేరు లేకపోవడంతో మొదట స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారిని కలిసి అడిగారు. రెండు, మూడురోజుల్లో మరో జాబితా వస్తుందని, ఆందోళన చెందాల్సిన పనిలేదని చెప్పడంతో నాలుగైదు రోజుల తర్వాత తిరిగి అదే అధికారిని అడిగాడు. బ్యాంకుకు వచ్చి ఉంటుంది, వెళ్లి అడగాలని చెప్పడంతో సురేశ్ అక్కడికి వెళ్లి అడిగారు. బ్యాంకు అధికారులు వ్యవసాయ అధికారులకే తెలుసని, జాబితా తీసి చూపించారు. అందులో తన పేరు లేదనే సంగతి తెలిసిన సురేశ్ నిరాశగా వెనుదిరగడం మినహా ఏమీ చేయలేని పరిస్థితి. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన రుణ మాఫీ తనకెంతో మేలు చేసిందని చెబుతున్న సురేశ్.. ఈ ప్రభుత్వంలో తనకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని వాపోతున్నాడు. అతనొక్కడే కాదు.. గ్రామానికి చెందిన 20 మంది రైతులకు రుణమాఫీ కాలేదు. బావుపేటలోని ఇండియన్ బ్యాంకులో పంట రుణాలు తీసుకున్నవారికెవరికీ ఖాతాల్లో డబ్బులు పడలేదు. ఈ బ్యాంకులో రుణం తీసుకున్న దాదాపు 700 మంది రైతుల్లో ఏడుగురికే మాఫీ అయినట్టు బ్యాంకు అధికారులు చెప్తున్నారు. కేడీసీసీబీ నుంచి రూ.లక్షలోపు రుణం తీసుకున్న రైతులు 61మంది ఉంటే, కేవలం 36 మందికే రుణమాఫీ వర్తించింది.



### మా ఊళ్లో చాలా మందికి మాఫీ కాలే

నాకు ఎకరం ఐదు గుంటల భూమి ఉంది. సాగుకు భిక్కనూరు మండలం జంగంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రూ.83వేలు రుణం తీసుకున్న. నా పేరు మొదటి విడత జాబితాలో ఉంటుందనుకున్న. కానీ రాలే. నాతోపాటు మా ఊళ్లో చాలా మందికి రూ.లక్షలోపే రుణాలున్న మాఫీ కాలే. రైతులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి.

- చెన్నప్పగారి ప్రభాకర్‌రెడ్డి, రైతు, జంగంపల్లి, నిజామాబాద్ జిల్లా

## రైతుల పేరిట మాగి షుగర్ ఫ్యాక్టరీ మోసం

- వందలాది మంది రైతుల పేరిట పంట రుణాలు మోసం
- రుణమాఫీ మెసేజ్‌లు చూసి అవాక్కయిన అన్నదాతలు

రుణం తీసుకోకున్నా.. రుణమాఫీ అయినట్టు మెసేజ్‌లు రావటంతో రైతులు అవాక్కయిన ఘటన సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్ డివిజన్ పరిధిలో చోటుచేసుకున్నది.నాలుగైదు రోజులుగా రైతులు నిజామాబాద్‌లోని నాందేడ్‌వాడ యూనియన్ బ్యాంక్‌కు వెళ్లి ఆరాతీయగా, కామారెడ్డి జిల్లాలోని మాగి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రైతుల పేరిట రుణాలు తీసుకున్న విషయం బయటపడింది. అవాక్కయిన రైతులు చెరుకు ఫ్యాక్టరీ వద్ద రాస్తారోకో చేశారు. దీంతో జిల్లా అధికార యంత్రాంగం కదిలింది. ఎంతమంది రైతుల మీద ఫ్యాక్టరీ యాజమాన్యం రుణాలు తీసుకున్న విషయమై ఆరా తీస్తున్నది.తమకు తెలియకుండా వేరే ఖాతాలు ఏమిటి? అందులో రుణాలు ఎలా ఇచ్చారో తెలియక రైతులు ఆందోళనకు గురవుతున్నారు. నో డ్యూ సర్టిఫికెట్ లేకుండా మరో బ్యాంకులో తమ పేర్లపై రుణాలు ఎలా ఇస్తారని నిలదీస్తున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం వద్ద రైతుల పట్టా పాస్‌బుక్, బ్యాంకు ఖాతా వివరాల ఆధారంగా ముందుగానే తీసుకున్న సంతకాల తో రుణాలు తీసుకున్నట్టు తెలుస్తున్నది. ఫ్యాక్టరీ యాజమాన్యానికి రుణాల కోసమని ఎలాంటి పత్రాలు ఇవ్వలేదని, బైబ్యాక్ ఒప్పందాలపై సంతకాలు మినహా మిగిలిన వ్యవహారాలు తమకేమీ తెలియదని రైతులు చెప్తున్నారు. బైబ్యాక్ ఒప్పందాల్లో భాగంగా ఈ తంతు జరిగినట్టు స్పష్టం అవుతున్నది. సమగ్ర విచారణ చేపట్టి, ఫ్యాక్టరీపై చర్యలు తీసుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.





### లక్షలోపే ఉన్నా ఎందుకు కాలే..?

నేను కోటగిరి ఎస్‌బీఐలో 2023 అక్టోబర్‌లో రూ.88వేల రుణం తీసుకున్నా. ఇటీవల ప్రభుత్వం రూ.లక్ష లోపు లోన్ తీసుకున్న వారికి రుణ మాఫీ చేసినట్టు చెప్పడంతో బ్యాంకుకు వెళ్తే..నీకు మాఫీ కాలేదని అధికారులు చెప్పిన్రు. ఎలాగైనా మాఫీ అవుతుందనుకున్నా.. కానీ నాకున్న రూ.88 వేలు క్రాప్‌లోన్ ఎందుకు మాఫీ కాలేదో అర్థం కావడం లేదు. ఎవరిని అడగాలో.. ఏం చేయాలో తెలుస్తలేదు.

- పొమ్మెడి రాములు, రైతు, కోటగిరి, నిజామాబాద్ జిల్లా

### బ్యాంకోళ్లు డబ్బులు వసూలు చేశారు..

నేను ఎకరన్నర పొలంపై రూ.60 వేల రుణాన్ని తీసుకున్నా. లోన్‌ను వడ్డీతో సహా చెల్లించాల్సిందేనని, లేదంటే రెన్యూవల్ కాదని బ్యాంకువాళ్లు అన్నారు. జూన్‌లో రూ.60 వేల అసలు, వడ్డీ రూ.1,800 కట్టాను. మళ్లీ నాకు రూ.67 వేల రుణం మంజూరు చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రకటించిన రూ.లక్ష లోపు రుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు. నాతోపాటు అదే నెలలో రెన్యూవల్ చేసుకున్నవారి పేర్లు జాబితాలో ఉన్నాయి.

- సదాశివయ్య, క్యాతూరు గ్రామం, అలంపూర్ మండలం, జోగులాంబ గద్వాల జిల్లా





### 65 వేల రుణం కూడా మాఫీ కాలె

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష రుణమాఫీ పథకం మాకు వర్తించలేదు. నా పేరు మీద సహకార సంఘం బ్యాంకులో రూ.65 వేల రుణం మాత్రమే ఉన్నా, అదీ కాలేదు. అధికారులను అడిగితే సహకార బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతులందరి పేర్లు ప్రభుత్వానికి పంపించాం అని అంటున్నారు. కాంగ్రెస్ గిట్ల అన్యాయం చేస్తదనుకోలె.

- దందె చంద్రు, వెంట్రావ్‌పేట్, సిర్పూర్ మండలం, కుమ్రంభీం ఆసిఫాబాద్

### ప్రభుత్వం ఇబ్బంది పెడుతున్నది

కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తమని చెప్పిన్రు. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చిన్రు. రూ.లక్షలోపు మాఫీ చేసినా.. మాకైతే కాలే. పెట్టుబడి సాయానికి రూ.80వేల లోన్ తీసుకున్న. మాఫీ కాకపోవడంతో ప్రతిరోజూ బ్యాంకు చుట్టూ తిరుగుతున్న. అధికారుల నుంచి సరైన సమాధానం లేదు. లోన్ మాఫీ అయితదన్న నమ్మకం కూడా పోయింది.

-షేక్ యాకూబ్ పాషా, బేతోలు, మహబూబాబాద్ జిల్లా





### రూ. 9వేల మిత్తి కట్టించుకున్రు..

నర్సాపూర్‌లోని ఎస్‌బీఐలో నాకు రూ. 90879 రుణమాఫీ అయ్యింది. అదనంగా రూ. 9వేల ఇంట్రెస్ట్ కడితేనే రుణం క్లియర్ అవుతుందని బ్యాంకు సిబ్బంది చెప్పిన్రు. ఇదేంటని అడిగితే కలెక్టర్‌ను, అగ్రికల్చర్ ఆఫీసర్‌ను అడగండి..మాకేం సంబంధంలేదంటున్రు. చేసేదేమీ లేక మొత్తం కట్టేసిన. బ్యాంకు అధికారులు చాలామంది నుంచి వడ్డీ కట్టించుకుంటున్రు.కేసీఆర్ ఉన్నప్పుడు ఇట్ల చేయలే. రేవంత్‌రెడ్డి లక్ష మాఫీ అంటూనే..అదనంగా వడ్డీల రూపంలో డబ్బులు దండుకుంటున్రు.

-సాదు ఆంజనేయులు, రైతు, అల్లీపూర్, శివ్వంపేట మండలం, మెదక్ జిల్లా



### కారణాలు తెలియవంటున్నారు

2022లో మద్దూరు ఏపీజీవీబీ బ్యాంక్‌లో రూ.80 వేల రుణాన్ని రెన్యూవల్ చేశాను. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన లిస్టులో నా పేరు లేదు. ఇదే విషయాన్ని బ్యాంక్ మేజేజర్ దగ్గర అడిగితే నీ పేరు లిస్టులో రాలేదని, వ్యవసాయశాఖ అధికారులను కలువాలని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదిస్తే తమకు కూడా కారణాలు తెలియవని అంటున్నారు.

-బొమ్మ ఐలయ్య, రైతు, రేబర్తి, మద్దూరు మండలం, సిద్దిపేట జిల్లా

### రైతుబంధు రాలే.. రుణమాఫీ కాలే

బీఆర్‌ఎస్ ఉన్నప్పుడు రైతుబంధు, రుణమాఫీ అన్ని చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ పథకానికి కొర్రీలు పెడుతుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రుణమాఫీ చేసిన తర్వాత కొత్తగా దౌల్తాబాద్ ఇండియన్ బ్యాంక్‌లో రూ.52 వేలు మళ్లీ తీసుకున్న. ఇప్పుడు రుణమాఫీకి ఏవో సాంకేతిక కారణాలు చెబుతున్రు. మరి అప్పుడు రుణమాఫీ అయ్యిందిగా...అప్పుడు లేని లోపాలు ఇప్పుడే ఎందుకొచ్చినయో అధికారులు సమాధానం చెప్పాలి. ఈ ప్రభుత్వం వచ్చాకా రైతుబంధు లేదు, రుణమాఫీ లేదు. ఇదేనా ప్రజాపాలన.

-వెంకట్‌రెడ్డి, రైతు, నస్తీపూర్, సంగారెడ్డి జిల్లా





### మా సొసైటీలో ఎవరికీ కాలే..!

నేను సొసైటీలో రూ.75 వేల రుణం తీసుకున్న. ఇప్పటివరకు నాకైతే రుణమాఫీ కాలే. రేపు మాపు అంటున్నరు. ఇంత వరకు మెసేజ్ కూడా రాలే. ఎన్నికల సమయంలో రుణ మాఫీ చేస్తమని హామీ ఇవ్వడంతో ఓట్లేసినం. ఇప్పుడేమో సవాలక్ష నిబంధనలు పెడుతున్నరు. ఇది సరికాదు. రైతులందరికీ మాఫీ చేయాలి. అసలు వడ్డీ కలిపి లెక్కలు వేయడం సరికాదు. మా గ్రామంలో చాలామంది చెన్నారావుపేట సొసైటీలో సభ్యులుగా ఉన్నరు. రూ.లక్ష లోపు రుణం తీసుకున్న సభ్యులెవరికీ కూడా మాఫీ కాలేదు. ప్రభుత్వం త్వరగా రుణమాఫీ చేసి, కొత్త రుణాలు ఇవ్వాలి.

- గుర్రం రవి, చెన్నారావుపేట, వరంగల్ జిల్లా

## రుణమాఫీ గందరగోళం

మొదటిపేజీ తరువాయి...

బ్యాంకు అధికారులను నిలదీస్తున్నారు. కొన్నిచోట్ల రైతులు బ్యాంకుల ముందు ధర్నాలు చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. మొన్న వరంగల్‌లో, నేడు ఆసిఫాబాద్‌లో రైతులు బ్యాంకుల ఎదుట ధర్నాకు దిగారు. రైతులకు సమాధానం చెప్పలేక అధికారులు చేతులెత్తేస్తున్నారు. పైనుంచి వచ్చిన జాబితా ప్రకారమే రుణమాఫీ చేస్తున్నామని చెప్తున్నారు. దీంతో రుణమాఫీ ప్రక్రియ రైతుల్లో గందరగోళం నింపింది. తమకు ఎందుకు రుణమాఫీ కాలేదో తెలియక రైతులు అయోమయానికి, ఆందోళనకు గురవుతున్నారు.

### రైతులు 70 లక్షలు.. మాఫీ చేసేది 32 లక్షలకే

రుణమాఫీకి సంబంధించి కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని, ఇందులో 70 లక్షల మందికి రుణ ఖాతాలు ఉన్నాయని, వీరందరికీ రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. కానీ అమల్లోకి వచ్చేసరికి మాత్రం అర్హుల సంఖ్యలో అడ్డంగా కోతపెట్టేశారు. సీఎం చెప్పిన ప్రకారం 70 లక్షల మందికి రుణమాఫీ కావాలి. కానీ ప్రభుత్వం కేవలం 32 లక్షల మందికే రుణమాఫీ చేస్తున్నట్టు తెలిసింది. ఇందుకోసం ప్రభుత్వం అత్యంత కఠిన నిబంధనలు అమలు చేసినట్టు సమాచారం. అంటే దాదాపు అర్హులైన 40 లక్షల మంది రైతులకు రుణమాఫీలో ప్రభుత్వం మొండి చేయి చూపింది.

### మూడు నిబంధనలతో కోతలు

రుణమాఫీకి పాస్ పుస్తకమే ప్రామాణికమన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆ తర్వాత అత్యంత కఠిన నిబంధనలను అమలు చేస్తున్నారు. ముఖ్యంగా మూడు నిబంధనల ఆధారంగా రుణమాఫీని అమలు చేస్తున్నట్టు తెలిసింది. రేషన్‌కార్డు లేని కుటుంబాలకు రుణమాఫీ చేయడం లేదు. దీంతోపాటు ఆదాయ పన్ను చెల్లించే వారికి కూడా రుణమాఫీ జాబితాలో చోటు దక్కలేదు. ఇక ప్రభుత్వ ఉద్యోగులకు కూడా రుణమాఫీలో ప్రభుత్వం చేయి చూపింది. ఈ మూడు నిబంధనల ఆధారంగా ఆయా కుటుంబాల్లోని ఒక్కరికి కూడా రుణమాఫీ చేయడం లేదు. ఈ మూడు నిబంధనల కారణంగానే మెజారిటీ రైతులు రుణమాఫీకి దూరమైనట్టు తెలిసింది. ప్రభుత్వం మాత్రం ఎలాంటి నిబంధనలు అమలు చేయలేదని చెప్తుండటం గమనార్హం. మరి ఎలాంటి నిబంధనలు అమలు చేయనప్పుడు అర్హుల సంఖ్య ఎందుకు తగ్గిందనే ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి సమాధానం మాత్రం రావడం లేదు.

### బడ్జెట్‌పై పూటకో మాట

రుణమాఫీ బడ్జెట్ పై ప్రభుత్వం పూటకో మాట మాట్లాడుతుండటం అనుమానాలకు తావిస్తున్నది. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో రుణమాఫీకి రూ.40 వేల కోట్లు అవసరమవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. తాజాగా దీన్ని రూ.31 వేల కోట్లకు తగ్గించారు. ఇదిలా ఉంటే బడ్జెట్లో ప్రభుత్వం రూ.26 వేల కోట్లు మాత్రమే కేటాయించింది. అంచనాలకు, అమలు లెక్కలకు, బడ్జెట్ కేటాయింపులకు పొంతన లేకుండా ఉన్నది. ఫైనల్‌గా రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవసరం అవుతాయని చెప్పిన ప్రభుత్వం.. బడ్జెట్లో రూ.26 వేల కోట్లే పెట్టడమేమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అంటే అవసరం కన్నా రూ.5000 కోట్లు తక్కువ కేటాయించింది. ఈ నేపథ్యంలో ఈ మేరకు లబ్ధిదారుల సంఖ్యలో కోతపెట్టడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.